నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 22 మే 2024 | HYDERABAD



## చెరువుల పునరుద్ధరణపై వర్క్‌షాపు

సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ) : అర్బన్ ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణ, పునర్నిర్మాణంపై రాష్ట్ర పురపాలక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. మున్సిపల్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్, ఎన్జీవోలతో జరిగిన ఈ సమావేశంలో జీహెచ్ ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ మోడరేటర్‌గా వ్యవహరించారు. చెరువుల పునరుద్ధరణ, పరిరక్షణపై ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ సహకారంపై పలు ఎన్జీవోల ప్రతినిధులతో సాధించిన ప్రగతి, అనుసరించిన విధానాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఎన్జీవోల ప్రతినిధులు ధృవాన్ష్, కల్పన రమేశ్, కె.శర్మ, ఇతర ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల పోరు ఉధృతం

రూ.1350 కోట్లు చెల్లించకుంటే..
మాన్‌సూన్, ఐఆర్టీని నిలిపివేస్తాం
ఎక్కడికక్కడ నిలిచిపోయిన అభివృద్ధి పనులు

సిటీబ్యూరో, మే 21, (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో కాంట్రాక్టర్ల పోరు ఉధృతమవుతున్నది. పెండింగ్ బకాయిలు చెల్లించే వరకు మెయింటెనెన్స్ పనులు చేపట్టబోమంటూ ఈ నెల 18వ తేదీ నుంచి కాంట్రాక్టర్లంతా పనులు మానేసి 'వీ వాంట్ పేమెంట్స్' సమ్మె చేపడుతున్నారు. ఇందులో భాగంగానే గడిచిన నాలుగు రోజులుగా రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు, కరెంట్ పోల్స్, పార్కులు, ప్లే గ్రౌండ్, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇలా మెయింటెనెన్స్ పనులు నిలిచిపోయాయి. తమకు రావాల్సిన రూ.1350 కోట్ల బకాయిలు చెల్లించే వరకు ఎట్టి పరిస్థితుల్లో పనులు చేపట్టబోమని, అవసరమైతే మాన్‌సూన్, ఐఆర్టీని నిలిపివేస్తామని అల్టిమేటం జారీ చేశారు. అధికారులు మే నెలకు సంబంధించి రూ.57 కోట్లు విడుదల చేశామని, ఐఆర్టీ పనులను నిలిపివేస్తే సంబంధిత కాంట్రాక్టర్లపై టెండర్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు.



ఔటర్ రింగు రోడ్డుపై కోకాపేట నియో పాలీస్ లేఅవుట్‌ను కలుపుతూ హెచ్ఎండీఏ నిర్మిస్తున్న ట్రంపెట్ నిర్మాణం

# కేసీఆర్ ఆశయం.. నేటి ఫలితం

బీఆర్ఎస్ హయాంలో కోకాపేట ఓఆర్ఆర్ ట్రంపెట్ నిర్మాణానికి రూ.300 కోట్లతో శంకుస్థాపన

శరవేగంగా పూర్తయిన నిర్మాణ పనులు
ఓఆర్ఆర్‌తో నియోపాలీస్ లేఅవుట్‌కు అనుసంధానం



గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు
20 నిమిషాల్లో ఎయిర్‌పోర్టుకు వెళ్లేలా ట్రంపెట్ డిజైన్
వచ్చే నెలలో ప్రారంభించేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు

సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ) : ఐటీ కారిడార్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు కోకాపేట నియో పాలీస్ లేఅవుట్. సుమారు 534 ఎకరాల విస్తీర్ణంలో హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసింది. ఒక్కో ప్లాట్ సైజును ఎకరం నుంచి ఏడు ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేశారు. ఈ లేఅవుట్‌లో అపరిమితంగా అంతస్థులు నిర్మించుకునేందుకు అనుమతి ఉండడంతో రియల్ ఎస్టేట్ సంస్థలు 40 నుంచి 60 అంతస్థుల్లో ఆఫీసు, నివాసం ఉండేందుకు వీలుగా ఆకాశహర్మ్యాలను నిర్మిస్తున్నాయి. ఐటీ కారిడార్‌లో హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీలకు గణనీయమైన డిమాండ్ ఉండడంతో ఎక్కడ చూసినా ఈ లేఅవుట్‌లో ఇలాంటి ప్రాజెక్టులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన కోకాపేట నియోపాలీస్ లేఅవుట్‌ను గ్రీన్ ఫీల్డ్ టౌన్ షిప్‌గా ఉండేలా డిజైన్ చేశారు. ఈ లేఅవుట్‌లో అన్ని నిర్మాణాలు పూర్తయితే వచ్చే 5-6 ఏళ్లలోనే దాదాపు 7 లక్షల మంది ఉద్యోగులు పనిచేసేలా వివిధ జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నాయి. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ మహానగరానికి మణిహారంలా మారిన ఔటర్ రింగు రోడ్డు నుంచి నేరుగా కోకాపేట నియోపాలీస్ లేఅవుట్‌లోకి వెళ్లేందుకు, వచ్చేందుకు వీలుగా అత్యంత విశాలమైన రహదారులతో ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఓఆర్ఆర్‌పై వినూత్న శైలిలో ట్రంపెట్‌ను నిర్మించారు. ఈ మొత్తం కోకాపేట నియోపాలీస్ లేఅవుట్ అభివృద్ధి కోసమే హెచ్ఎండీఏ సుమారు రూ.300 కోట్లను వెచ్చించింది. ఇప్పటికే లేవుట్‌లో మౌలిక వసతుల కల్పన పూర్తయి, భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇక మిగిలిన ఓఆర్ఆర్ ట్రంపెట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే దీన్ని ప్రారంభించేందుకు హెచ్ఎండీఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

### 20 నిమిషాల్లో ఎయిర్‌పోర్టుకు

ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కోకాపేట 20కి.మీ దూరమే ఉండడంతో ఈ ప్రాంతానికి మంచి డిమాండ్ నెలకొన్నది. కోకాపేటకు ఒక వైపు గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మరోవైపు గండిపేట జలాశయం ఉండడంతో ఈ ప్రాంతం అందరినీ విశేషంగా ఆకర్షిస్తున్నది. గచ్చిబౌలి చౌరస్తా నుంచి ఔటర్ రింగు రోడ్డు పైకి వెళ్లేందుకు ప్రత్యేక మార్గం ఉంది. అదే తరహాలో కోకాపేట నియో పాలీస్ నుంచి ఓఆర్ఆర్ వైపు వచ్చే వాహనాలు వెళ్లిపోయేలా ట్రంపెట్ నిర్మాణం చేపట్టారు. కేవలం 20 నిమిషాల్లో కోకాపేట నియోపాలీస్ నుంచి ఎయిర్‌పోర్టుకు చేరుకునేలా రోడ్లను నిర్మించారు.

### మౌలిక వసతులకు పెద్ద పీట

గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని కోకాపేట లేఅవుట్‌ను చేపట్టింది. గచ్చిబౌలి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, నార్సింగి, గండిపేట ప్రాంతాలను కలుపుతూ లింకు రోడ్లను నిర్మిస్తున్నది. ఇప్పటి వరకు హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్‌ల కంటే భిన్నంగా కోకాపేట నియో పాలీస్ లేఅవుట్‌ను అత్యంత విశాలమైన రోడ్లతో డిజైన్ చేశారు. 150 అడుగుల నుంచి మొదలుకొని 120, 100 అడుగుల వెడల్పుతో కూడిన రోడ్లను నిర్మిస్తూ, వాటి చుట్టూ బాక్స్ డ్రైయిన్‌ను ప్రత్యేకంగా నిర్మించారు.

### ఓఆర్ఆర్‌పై ట్రంపెట్ నిర్మాణం

కోకాపేటలో ఔటర్ రింగురోడ్డుపై నిర్మిస్తున్న ట్రంపెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నది. గచ్చిబౌలి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ వైపు నుంచి ఓఆర్ఆర్‌కు మరోవైపు ఉన్న కోకాపేట రావాలంటే ప్రస్తుతం ఉన్న ఇంటర్‌చేంజ్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో కొత్తగా హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన నియో పాలీస్ లేఅవుట్ నుంచి నేరుగా ఓఆర్ఆర్ మీదుగా గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ చేరుకునేందుకు వీలుగా భారీ ట్రంపెట్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు ఓఆర్ఆర్ మీదుగా వచ్చే వాహనాలు నేరుగా కోకాపేటలోని నియో పాలీస్ లేఅవుట్, గోల్డ్ మైల్ లే అవుట్‌లోకి, శంకర్‌పల్లి రోడ్డుకు చేరుకునేలా అత్యున్నత ప్రమాణాలతో నిర్మించారు.

# ప్రతి నీటి బొట్టు.. ఒడిసి పడుదాం!

వర్షపు నీటిని సేకరిద్దాం.. భూగర్భ జలాలను పెంపొందిద్దాం!
జీహెచ్ఎంసీ పార్కులలో పైలెట్‌గా ఐదు భారీ రీచార్జ్ ప్రాజెక్టులు
అమృత్ పథకంలో భాగంగా తొలుత పార్కులలో అమలు

మార్పు రావాలి! నీరు ఇంకాలి!

సిటీబ్యూరో, మే 21, (నమస్తే తెలంగాణ) : కాంక్రీట్ జంగిల్‌గా మారిన భాగ్యనగరంలో నీరు ఇంకే మార్గమే కరువైంది. వాననీటి సేకరణ, సంరక్షణ చర్యలు చేపట్టని ఫలితంగా అటు భూగర్భశోకాన్ని, ఇటు జనాల క'న్నీళ్ల'కు కారణమవుతున్నది. ఇదే క్రమంలో శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ, పెరుగుతున్న నీటి అవసరాల ఫలితంగా నగరంలో భూగర్భజలాలు రోజురోజుకు అందనంత స్థాయిలో పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇంకుడు గుంతలపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చి భూగర్భ జలాలను పెంపొందించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అమృత్ పథకంలో భాగంగా ఐదు పార్కులలో రీచార్జ్ ప్రాజెక్టును చేపట్టాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ నిర్ణయించారు. ఈ మేరకు భారీ రీచార్జ్ పిట్స్ (ఇంకుడు గుంతల) నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

### 100 నుంచి 120 అడుగుల లోతు ఇంకుడు గుంతలు

ఈ ఐదు పార్కులలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపడుతున్నారు. 100 నుంచి 120 అడుగుల లోతు వరకు షాలో ఆక్వి ఫర్ ఇంజక్షన్ బోర్‌వెల్‌లను డ్రిల్ చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ ప్రాజెక్టును ది రెయిన్ వాటర్ ప్రాజెక్టు సహకారంతో అమలు చేస్తున్నది. పార్కులో 6,85,738 స్క్వేర్ మీటర్లు (చ.మీ) స్థలం సామర్థ్యం 44.6 కోట్ల లీటర్లు, వార్షిక వర్షపాతం 53 లక్షల లీటర్లతో ఇంకుడు గుంతల (రీ చార్జ్ ప్రాజెక్టు)ను చేపడుతున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం అదనపు కమిషనర్ డాక్టర్ సునంద రాణి, రెయిన్ వాటర్ ప్రాజెక్టు అధిపతి కల్పన రమేశ్ పార్కులో చేపట్టిన సాంకేతిక ఇంటర్వెన్షన్స్, రీచార్జ్ ఎలా అవుతుందో కాలనీ వాసులకు వివరించారు. పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాల స్థాయి ఎలా మెరుగుపడుతుందో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (యూబీడీ) ఎం.చంద్రశేఖర్ రావు, ఎల్బీనగర్ జోన్ అనిరుద్, ఎన్ఐయూఏ ప్రతినిధి నరసింహారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### ఐదు పార్కుల్లో పైలెట్ ప్రాజెక్టుగా..

గ్రేటర్‌లో భూగర్భజలాలు అడుగంటిపోయి బోరుబావులు ఎండిపోతున్నాయి. అదే సమయంలో చిన్నపాటి వర్షానికే నగరంలో వీధులన్నీ జలమయం అవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అమృత్ పథకంలో భాగంగా జీహెచ్ఎంసీ పైలెట్ ప్రాతిపదికన షాలో ఆక్వి ఫర్ రీచార్జ్ ప్రాజెక్టును చేపట్టాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు అమలుకు ఎన్ఐయూఏ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్నది. ప్రయోగాత్మకంగా జీహెచ్ఎంసీ ఐదు పార్కులను ఎంపిక చేసింది. ఖైరతాబాద్‌లోని కేఎల్ఎన్ యాదవ్ పార్కు, శేరిలింగంపల్లి జోన్‌లో టెక్నో పార్కు, సికింద్రాబాద్ జోన్‌లో ఇందిరాపార్కు, ఎల్బీనగర్ జోన్‌లో హబ్సిగూడలోని కాకతీయ నగర్ పార్కు, సైనిక్‌పురిలోని ఈ -సెక్టార్ పార్కులలో ఈ ప్రాజెక్టు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టడుతున్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అధికారులు



ప్రమాదంలో మృతిచెందిన రవీందర్, చిత్రంలో తీవ్రగాయాలతో భార్య సరళా దేవి

# 3 సెకన్లలోపే కుప్పకూలిన జీవితం

దవాఖానలో దంపతులపై కూలిన చెట్టు
భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

బొల్లారం, మే 21 : చికిత్స నిమిత్తం బొల్లారం కంటోన్మెంట్ దవాఖానకు వస్తున్న దంపతులపై చెట్టు విరిగి పడడంతో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట, తూముకుంట ప్రాంతానికి చెందిన రవీందర్(56) ప్రైవేటు ఉద్యోగి. సరళా దేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. మంగళవారం ఉదయం 10గంటల సమయంలో సరళాదేవికి కీళ్ల వ్యాధికి సంబంధించిన ఇంజెక్షన్ నిమిత్తం ద్విచక్ర వాహనంపై బొల్లారం కంటోన్మెంట్ దవాఖానకు వచ్చారు. దవాఖానలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఎండిపోయిన చెట్టు ఒక్కసారిగా వారిపై కూలిపడింది. ఈ ఘటనలో రవీందర్ అక్కడికక్కడే మృతిచెందగా.. సరళాదేవి తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. మూడు సెకన్లలోనే చెట్టు కూలిపోయిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది.

# టౌన్‌ప్లానింగ్ లేదా?

పెండింగ్ దరఖాస్తులపై సర్కిళ్ల వారీగా సమీక్ష
షార్ట్‌ఫాల్స్ దరఖాస్తుల వివరాలు ఇవ్వండి
టీఎస్ బీపాస్ దరఖాస్తులను పరిష్కరించాలి
ఏదో కారణంతో దరఖాస్తులను తిరస్కరించకండి

టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై కమిషనర్ రొనాల్డ్ రాస్ అసంతృప్తి

సిటీబ్యూరో, మే 21, (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరుపై కమిషనర్ రొనాల్డ్‌రాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ రంగ అనుమతుల జారీలో అధికారుల పనితీరును మెరుగుపర్చుకోవాలని హితవు పలికారు. ఏదో ఒక కారణంతో తిరస్కరించడం సరికాదన్నారు. గత నాలుగైదు నెలల్లో షార్ట్‌ఫాల్స్, రిజెక్ట్ చేసిన దరఖాస్తుల వివరాలు అందించాలని కోరారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ శాఖ అధికారులతో ఆయా అంశాలపై కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షార్ట్‌ఫాల్స్, రిజెక్ట్ అయిన దరఖాస్తుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సర్కిళ్ల వారీగా సమీక్షించారు. ఇన్‌స్టంట్ అప్రూవల్, రిజిస్ట్రేషన్లకు సంబంధించి జాప్యం జరగరాదని, క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాత ఆమోదించాలన్నారు. టీఎస్ బీపాస్ కింద వచ్చిన బిల్డింగ్ పర్మిషన్లకు సంబంధించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. కమర్షియల్ అనుమతులకు సంబంధించి క్షేత్రస్థాయిలో కుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలని, ప్రతి గల్లీకి వెళ్లి చూడాలన్నారు. సెల్లార్‌లను పరిశీలించాలని సూచించారు. వర్షాలతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్, అడిషనల్ సీపీలు గంగాధర్, ప్రదీప్‌లతో పాటు సీపీలు, ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెట్రో రెండో దశ డీపీఆర్ సిద్ధం

70 కిలోమీటర్ల మేర చేపట్టాలని నిర్ణయం
ఏడు కారిడార్లుగా అలైన్‌మెంట్లు ఖరారు
జూన్‌లో ప్రభుత్వానికి నివేదిక అందజేత
నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌కు అధిక ప్రాధాన్యత
సీఎం పరిశీలనకు మెట్రో డీపీఆర్



సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరంలో మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించిన 7 మెట్రో కారిడార్‌లలో మొత్తం 70 కి.మీ మేర నిర్మించే మార్గాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో సర్వేలు, ట్రాఫిక్ అధ్యయనం, మెట్రో స్టేషన్లు, డిపోల నిర్మాణం వంటి అంశాలపై హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ సిస్ట్రా కన్సల్టెన్సీ సంస్థతో పనిచేస్తూ డీపీఆర్‌ను రూపొందిస్తున్నది. డీపీఆర్‌ను రూపొందించేందుకు అవసరమైన క్షేత్ర స్థాయి అధ్యయనం పూర్తికావచ్చిందని, జూన్ నెలలోనే డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందజేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామని మెట్రో అధికారి ఒకరు తెలిపారు. నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భవిష్యత్తు రవాణా అవసరాల దృష్ట్యా, విమానాశ్రయానికి మెట్రో రైలు మార్గం ద్వారా కనెక్టివిటీ ఉండేలా రెండో దశ మెట్రో నిర్మాణాన్ని 70 కి.మీ మేర చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికి అనుగుణంగా 7 మార్గాల్లో అధ్యయనం చేసి డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.20వేల కోట్ల వ్యయం అవుతుందని ఇప్పటికే మెట్రో అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో దీనిపై ప్రకటనలు చేయకుండా, జూన్ 4 తర్వాత కోడ్ ముగిసిన వెంటనే రెండో దశ మెట్రోకు సంబంధించిన డీపీఆర్‌లను ప్రభుత్వానికి అందజేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. పూర్తయిన డీపీఆర్‌లను సీఎం పరిశీలనకు పంపిన తర్వాత కారిడార్‌ల వారీగా టెండర్లు పిలిచే ప్రక్రియను మొదలు పెట్టనున్నారు.

### కారిడార్‌ల వారీగా డీపీఆర్‌లు..

ఎక్కువ మంది నగర వాసులకు ప్రయోజనం కలిగేలా మెట్రో రైలు రెండో దశను నిర్మిస్తున్నారు. ఇందులో ప్రధానంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేసే మార్గాన్ని నాగోల్ నుంచి ఎల్బీనగర్ మీదుగా చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, మామిడిపల్లి కలుపుతూ విమానాశ్రయం లోపలి వరకు మెట్రో రూట్‌ను 29 కి.మీ మేర ఖరారు చేశారు. దీంతో పాటు ఇతర మార్గాలకు సంబంధించిన తుది రూట్ మ్యాప్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైదరాబాద్ మెట్రో అధికారులు సిద్ధం చేశారు. కొత్తగా ఖరారు చేసిన మొత్తం 70 కి.మీ మెట్రో మార్గాల్లో వివిధ ప్రాంతాలను కలుపుతూ ఉండగా, అందులో అతి పొడవైన మెట్రో మార్గంగా నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఉంది. దీని తర్వాత మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు 14 కి.మీ, రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి బయో డైవర్సిటీ జంక్షన్, నానక్‌రామ్‌గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) వరకు 8 కి.మీ, ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్ వరకు 8 కి.మీ, మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు 4 కి.మీ, ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు వరకు 1.5 కి.మీ, ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ చొప్పున మొత్తం 70 కి.మీ మెట్రో మార్గాన్ని 7 కారిడార్‌లుగా విభజించి డీపీఆర్‌లు రూపొందిస్తున్నారు. కాగా ఇందులోఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ మార్గాన్ని మొదటి దశలోనే ప్రతిపాదించారు. మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణంలో ఎంతో అనుభవం ఉన్న సిస్ట్రా కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వం నిర్ధేశించిన మార్గాలకు వేర్వేరుగా డీపీఆర్‌లను రూపొందిస్తున్నది. నగరంలోని అన్ని ప్రాంతాలకు మెట్రో రైలు కనెక్టివిటీని విస్తరించడం ద్వారా భారీ సంఖ్యలో పేద, మధ్యతరగతి వర్గాలకు మెట్రో రైలు సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మార్గాలను ఎంపిక చేసింది.

### 66 కి.మీతో అత్యంత పొడవైన కారిడార్‌గా..

మొదటి దశలోని కారిడార్-3 (నాగోల్ -రాయదుర్గం) 29 కి.మీ ఉండగా, రెండో దశలో నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మరో 29 కి.మీ, అదేవిధంగా రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వరకు 8 కి.మీ కలిపి మొత్తం 66 కి.మీ మెట్రో మార్గం అనుసంధానం కానున్నది. దీంతో ఈ మెట్రో మార్గం పొడవు 66 కి.మీ. కాగా నగరంలోనే అత్యంత పొడవైన మెట్రో మార్గంగా మారనున్నది. ఆ తర్వాత మొదటి దశలో కారిడార్-1(మియాపూర్-ఎల్బీనగర్ 29 కి.మీ) రెండు వైపులా ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 8 కి.మీ, మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్‌చెరువు వరకు మరో 14 కి.మీ కలిపి మొత్తం 51 కి.మీ పొడవుతో నిర్మాణం కానున్నది. దీనివల్ల నగరంలో ఎక్కడ ఉన్నా శివారు ప్రాంతాలకు మెట్రో మార్గాల ద్వారానే వేగంగా తమ గమ్య స్థానాలకు చేరుకునేలా నిర్మిస్తున్నారు.

### రెండో దశలో చేపట్టే మెట్రో కారిడార్లు

**కారిడార్ 2 :** ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు (5.5 కి.మీ)( మొదటి దశలో ప్రతిపాదించిన మార్గం)
**కారిడార్ 2:** ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు వరకు (1.5 కి.మీ)
**కారిడార్ 4 :** నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్బీనగర్ మీదుగా చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు, మైలార్‌దేవ్ పల్లి, పీ7 రోడ్డు నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (మొత్తం 29 కి.మీ)
**కారిడార్ 4 :** మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు (4 కి.మీ)
**కారిడార్ 5 :** రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి బయో డైవర్సిటీ జంక్షన్, నానక్‌రామ్‌గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్) వరకు (8 కి.మీ)
**కారిడార్ 6:** మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు (14 కి.మీ)
**కారిడార్ 7:** ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్ వరకు (8 కి.మీ)